క్లుప్తంగా

కళాకారులకు సత్కారం



నందిగామరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంబారుపేట బొడ్డురాయి సెంటరులో శనివారం రాత్రి ప్రదర్శించిన ఆనంద లహరి, మంచి మనుషులు సాంఘిక నాటికలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గరికపాటి భాస్కరం, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి



నందిగామటౌన్: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించటం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని ముక్కపాటినగర్‌లో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆదివారం రాత్రి ఆమె ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ క్రీడలు యువత జీవితంలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు కృషి : ఎస్ఐ



నందిగామరూరల్: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఎస్ఐ అభిమన్యు తెలిపారు. పట్టణ సమీపంలోని అంబారుపేట వైజంక్షన్ వద్ద రోడ్డుపై పడిన గోతులకు ఆదివారం ఆయన దగ్గరుండి పూడ్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ అభిమన్యు మాట్లాడుతూ విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రెండు పక్కలా నందిగామ పట్టణ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాహనాలు సర్వీస్ రోడ్డుపై నుంచే వెళ్తున్నాయన్నారు. దీంతో రహదారిపై పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదాలు చోటుకుంటున్నాయన్నారు. రోడ్డు మరమ్మతుల అంశాన్ని జాతీయ రహదారి, టోల్‌ప్లాజా అధికారులకు తెలిపినా సరైన చర్యలు తీసుకోకపోవడంతో తామే స్వయంగా గుంతలను పూడ్పించి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నట్లు వివరించారు. గుంతలను పూడ్పించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్న ఎస్ఐ అభిమన్యును వాహన చోదకులు, ప్రయాణికులు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ. 93వేల విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట):గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం నందిగామ మండలం రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాకర్ల హరిప్రియ రూ. 93,649లను విరాళంగా అందించారు. అనంతరం ఈవో సాంబశివరావు దాత హరిప్రియకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు

జగ్గయ్యపేటఅర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు ఆదివారం శ్రీరంగనాయకస్వామి ఆలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు అనంతరాజా, సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్ పాల్గొన్నారు.



తిరుమలగిరిలో మహా చండీదేవి అలంకారంలో అమ్మవారు



పెనుగంచిప్రోలులో శ్రీమహా చండీదేవి అలంకరణలో అమ్మవారు



మహాచండీదేవిగా దర్శనమిస్తున్న అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



ముక్త్యాలలో శ్రీమహాచండీగా దర్శనమిస్తున్న అమ్మవారు



మక్కపేట అయ్యప్ప ఆలయంలో చండీదేవి అలంకరణలో అమ్మవారు



పెనుగంచిప్రోలు టౌన్‌సెంటర్‌లో శ్రీమహా చండీదేవి అలంకరణలో అమ్మవారు

మహాచండీగా అమ్మవారు

జగ్గయ్యపేటఅర్బన్: శరన్నవరాత్రి మహోత్సవాలలో ఆదివారం జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా ఆలయాలు, మండపాల్లో అమ్మవారు శ్రీమహా చండీదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో రామప్పశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీచండీహోమంలో దంపతులు పాల్గొన్నారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో సువాసినీ పూజ చేశారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీలలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయంలో శ్రీధనలక్ష్మీదేవిగా, అద్దాలబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం (పెద్ద శివాలయం), గాయత్రీదేవి ఆలయం, మార్కండేయబజారు, తోటబజారులోని మండపాల్లో అమ్మవార్లను భక్తులు చండీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి ఆదివారం ఏడోరోజు శ్రీ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమలగిరిలో వేంచేసియున్న మల్లేశ్వరస్వామి, ముక్త్యాలలోని భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను అర్చకులు మహాచండీ దేవిగా అలంకరించారు. మండపాల వద్ద మహిళలు కుంకుమపూజలు చేశారు. బలుసుపాడు గురుధాం, చిల్లకల్లు, కె.అగ్రహారం గ్రామాల్లోని అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం మహాచండీగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాచండీ అలంకారాన్ని పురస్కరించుకుని మక్కపేటలోని శ్రీద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



పేటలో శ్రీలలితత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు



కంచికచర్ల కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



పెద్దాపురంలో మహా చండీదేవి అలంకారంలో అమ్మవారు



గోళ్లమూడిలో మహాచండీ అలంకారంలో పార్వతీ అమ్మవారు



పేటలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పెనుగంచిప్రోలు తూర్పుబజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు ఆదివారం శ్రీమహాచండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చనలు చేశారు. టౌన్ సెంటర్‌లోని ఎస్సీ కాలనీ, పాత సినిమాహాల్ సెంటర్‌లో నవరాత్రుల పందిరిలో అమ్మవార్లను శ్రీ మహాచండీ దేవిగా అలంకరించారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, నవాబుపేట, ముండ్లపాడు గ్రామాల్లో నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామ రూరల్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. నందిగామతోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాలలో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలకు ఆదివారం ప్రత్యేక అలంకరణలతోపాటు విశేష పూజలు చేశారు. అంబారుపేటలోని సత్యమ్మ అమ్మవారిని అర్చకులు మహాచండీదేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో సీతారావమ్మ, ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి పూజల అనంతరం వారికి ఆశీర్వచనం అందజేశారు. మండలంలోని గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారు, దాములూరు కూడలిలోని రాజరాజేశ్వరీదేవి, లింగాలపాడు లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారు, వీరభద్రస్వామి ఆలయంలోని భద్రకాళి అమ్మవారు, చందాపురంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత, మునగచర్లలోని దుర్గమ్మ అమ్మవార్లు మహాచండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లగిరిగట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లు లలితాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: పట్టణంలోని ప్రధాన ఆలయాలతోపాటు ఆయా ప్రధానవీధుల్లో ప్రత్యేక మండపాలలో ఏర్పాటు చేసిన అమ్మవార్లకు భక్తులతు ఆదివారం విశేష పూజలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు కాత్యాయనీదేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు మహాచండీదేవిగా, మరిడీ మహాలక్ష్మి అమ్మవారు గజలక్ష్మీదేవిగా, రామలింగేశ్వరనగర్‌లోని సాయి అయ్యప్ప ఆలయంలోని మాలికాపురత్తమ్మ అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నెహ్రూనగర్ వెంకటేశ్వరస్వామి లయంలోని పద్మావతి అమ్మవారు, కనకదుర్గనగర్‌లోని దుర్గామాత, రెవెన్యూ కాలనీలోని అంకమ్మ, భద్రకాళి అమ్మవార్లను మహాచండీ దేవిగా అలంకరించారు. చండీ, మహాలక్ష్మి, సూర్యనారాయణ భగళాముఖి హోమాలు, పూజలు చేశారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 200 కేజీల వివిధ రకాల పూలతో పుష్పాభిషేకం చేశారు. మహాలక్ష్మి ఆలయం, ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవార్లను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. వసంతకాలనీ కమ్యూనిటీ హాల్, శివసాయిక్షేత్రంలో అమ్మవార్లను కాత్యాయనీదేవిగా అలంకరించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పెద్దాపురం, నరసింహారావుపాలెంలో అమ్మవార్లను ఆదివారం మహాచండీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతి, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



పల్లగిరి త్రిశక్తిపీఠంలో కుంకుమపూజ చేస్తున్న భక్తులు



నందిగామలో సుహాసిని, చండీ దీక్షా పూజలు చేస్తున్న మహిళలు

డిజిటల్ బుక్ కార్యకర్తలకు శ్రీరామరక్ష



జగ్గయ్యపేటలో డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పరిశీలకులు ఆళ్ల చల్లారావు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా, నాయకులు

తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: డిజిటల్ బుక్ వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యులకు శ్రీరామరక్షగా పనిచేస్తుందని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు ఆళ్ల చల్లారావు, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు రవిచంద్ర, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా), జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపతి విజితతో కలిసి ఆదివారం ఆయన డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు డిజిటల్ బుక్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. లేదా వెబ్‌సైట్‌లో వారి సమస్యలు నమోదు చేయవచ్చని సూచించారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ప్రతి వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు న్యాయం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఓట్లు వేసిన ప్రజలకే వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. కూటమి పాలకులు విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను పూర్తిగా భ్రష్టుపట్టించారన్నారు. దేశ చరిత్రలో ఓటు వేసిన ప్రజలకే వెన్నుపోటు పొడిచిన ఏకైక ప్రభుత్వం ఈకూటమి ప్రభుత్వమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై హత్యలు, దాడులతోపాటు అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనుగంచిప్రోలు అమ్మవారి కుంకుమపూజ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు 20మందిపై అక్రమంగా కేసులుపెట్టి 40 రోజులు జైల్లో పెట్టి ఇబ్బందిపాలు చేశారని గుర్తుచేశారు. నవాబుపేటలో పార్టీ సీనియర్ నాయకుడు గింజుపల్లి శ్రీనును అందరూ చూస్తుండగానే టీడీపీ గూండాలు మూకుమ్మడి దాడిచేసి, తిరిగి ఆయనపైనే కేసులుపెట్టి ఇబ్బందులు పెట్టారన్నారు. బాధితులందరికీ ఈ డిజిటల్ బుక్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. చట్టాన్ని అమలుచేసే విషయంలో పోలీసులు కూడా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి-తీవ్రగాయాలు

కంచికచర్ల: వేగంగా బైక్ నడుపుతున్న యువకుడిని మందలించిన వ్యక్తిపై యువకుడి తండ్రి గాజుసీసాతో దాడిచేసిన కంచికచర్ల మండలం పరిటాలలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పి.విశ్వనాథ్ కథనం మేరకు పరిటాల గ్రామానికి చెందిన పాల సాయిచరణ్ అనే యువకుడు బైక్‌ను వేగంగా నడుపుతుండగా, అదే గ్రామానికి చెందిన షేక్ షాజహాన్ అనేవ్యక్తి మితిమీరిన వేగం ప్రమాదమంటూ ఆ యువకుడిని మందలించాడు. దీంతో సాయిచరణ్ ఆ విషయాన్ని తనతండ్రి రాధాకృష్ణకు చెప్పడంతో ఆయన వెంటనే షాజహాన్‌పై గాజుసీసాతో దాడిచేశాడు. ఈఘటనలో షాజహాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన

నందిగామరూరల్: స్వస్థ్ నారి.. సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా లింగాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని అడవిరావులపాడులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలు, బాలికలకు వైద్యపరీక్షలు చేశారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి గౌతమి మాట్లాడుతూ మహిళలు, బాలికలకు ఓరల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, సూరాకొండ, సీహెచ్‌వో రాజేశ్వరి, ఏఎన్ఎం శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, అంగనవాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ



చెవిటికల్లు వద్ద కృష్ణానది వరద నీటిని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ బాలకృష్ణ

కంచికచర్ల: కృష్ణానది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ సూచించారు. మండలంలోని చెవిటికల్లు వద్ద ఆదివారం ఆయన కృష్ణానదిని వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలైన పులిచింతల ప్రాజెక్టు నుంచి కృష్ణానదికి 7లక్షల క్యూసెక్కుల నీరు విడుదలైందని, మరో 50 వేల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశాలున్నాయన్నారు.

నదీతీర గ్రామాలైన చెవిటికల్లు, గనిఆత్కూరు, మున్నలూరు, కునికెనపాడు కొత్తపేట గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గని ఆత్కూరు లంకలో ఉన్న కొంతమందిని అమరావతి వైపు పంపించామని, మరో 14మంది ఉన్నారని సమాచారం వచ్చిందన్నారు. వారిని కూడా సురక్షిత ప్రాంతానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అవసరమైనచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ వెంట డిప్యూటీ తహసీల్దార్ వేమూరి మానస, ఆర్ఐ వెంకటరెడ్డి, వీఆర్వో సునందారాణి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఆత్మీయ సమ్మేళానికి హాజరైన 1979-80 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1979–80 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నూతలపాటి ఫంక్షన్ హాలులో పూర్వవిద్యార్థులంతా కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

నిత్యనూతనం జాషువా కవిత్వం

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కవి గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, కవి, రచయిత దోసపాటి నాగేశ్వరరావు తదితరులు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ జాషువా కవిత్వం నిత్య నూతనమైనదని కొనియాడారు. దోసపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ వడగాల్పు నాజీవితం, వెన్నెల నా కవిత్వం అన్న విశ్వనరుడు గుర్రం జాషువా అని పేర్కొన్నారు. అనంతరం జాషువా ప్రతిభా పురస్కారాలను వినన్నపేట ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.జాన్సన్ దేవరాజ్, వెంట్రపాటి సుభాషిణి, పూసపాటి వేదాద్రిలకు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రసమయి సాహితీ సమితి సభ్యులు దేశపోగు రామయ్య, మెటికల నాగభూషణం, కౌన్సిలర్లు పందుల రోశయ్య, పూసల పుల్లారావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పేటలో గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర, దోసపాటి తదితరులు

నందిగామ పట్టణంలో..

నందిగామరూరల్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. జాషువా చిత్రపటానికి గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాటి సమాజంలో సాగుతున్న అన్యాయాలను జాషువా తన కవితల ద్వారా ప్రతిఘటించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



జాషువాకు నివాళులర్పిస్తున్న రామచంద్రుడు తదితరులు



నందిగామలో జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

గుర్రం జాషువా గొప్ప కవి...

నందిగామటౌన్: సమాజంలోని అసమానతలను అక్షరమనే ఆయుధంతో ప్రశ్నించిన గొప్ప కవి గుర్రం జాషువా అని న్యాయవాది కర్ల నాగభూషణం కొనియాడారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో గుర్రం జాషువా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు అద్దంకి మణిబాబు, ఎక్కిరాల హనుమంతరావు, ఉప్పులూరి డేవిడ్‌రాజు, వేల్పుల కిషోర్, వేదుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.